ఆపత్కాలంలో రక్షణగా ఆరోగ్య పథకాలు

- పేదలకు అండగా నిలిచిన ఆరోగ్యశ్రీ
- 1,999 రోగులకు రూ.7.34 కోట్ల మంజూరు
- ఆరోగ్య ఆసరా ద్వారా రూ.83.25 లక్షల భృతి
- ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన


గ్రామాల్లో ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన పేదలు (ఫైల్)


వైఎస్సార్ ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న వృద్ధుడు

ఏలూరు రూరల్ : పేదల ఆరాధ్య దైవం సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పథకాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ, పథకానికి జవసత్వాలు ఇవ్వడంతోపాటు ఆరోగ్య సురక్ష, ఆరోగ్య ఆసరా వంటి పథకాలను చేపట్టి వాటన్నింటికీ విరివిగా నిధులు కేటాయించారు. సీఎం జగన్ ఆరోగ్య శ్రీ పథకం పరిధిని పెంచి పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించారు. ఆరోగ్యశ్రీ పథకం అర్హుల ఆదాయాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు, వైద్య సేవలను 1,059 నుంచి 3,257 వరకూ పెంచారు. గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కేన్సర్, తదితర జబ్బులతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలకు సైతం ఆరోగ్యశ్రీలో సేవలు అందిస్తారు. వివిధ రోగాలకు సంబంధించి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి విశ్రాంతి సమయంలోనూ ఆర్థికంగా చేయూత అందిస్తున్నారు. రోజుకు రూ.225 చొప్పున నెలకు సుమారు రూ.5 వేలు ప్రభుత్వం అందిస్తోంది. ఏలూరు రూరల్ మండలంలో ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందిన రోగులకు రూ.83,25,975 భృతి రూపంలో ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఈ ఐదేళ్ల పాలనలో ఏలూరు రూరల్ మండలంలో 1,999 మంది పేదలు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్య సేవలు అందుకున్నారు. వీరి కోసం ప్రభుత్వం రూ.7,34,39,871 ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించింది. ఇందులో చాటపర్రు గ్రామస్తులకు రూ.1,06,26,069, పైడిచింతపాడుకు రూ.49,77,955, ప్రత్తికోళ్లలంక రూ.91,77,721, కోటేశ్వరదుర్గాపురంలో రూ.17,59,346, కోమటిలంక రూ.14,70,476, శ్రీపర్రు రూ.1,00,38,540, పెదయాగనమిల్లి రూ.5,87,954, గుడివాకలంక రూ.1,09,65,871, జాలిపూడి రూ.80,23,128, మల్కాపురం రూ.51,83,420, మాదేపల్లి రూ.1,06,29,391 ఖర్చు చేసింది.


ఏలూరు ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కౌంటర్ వద్ద సేవలు పొందుతున్న ప్రజలు

సేవలు పొందండి ఇలా..

ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న పేదలు ఆరోగ్య మిత్ర ద్వారా ఆసుపత్రుల్లో ఉచిత అడ్మిషన్ పొందవచ్చు. రోజూ డాక్టర్ చెకప్, నర్సింగ్ సేవలు, వైద్య పరీక్షలు, ఉచితంగానే అందుకోవచ్చు. మందులు, శస్త్ర చికిత్స, అవసరమైన ఇంప్లాంట్లు, చికిత్స సమయంలో అల్పాహారం, భోజనం, ఇంటికి వెళ్లే చార్జీలనూ ప్రభుత్వమే చెల్లిస్తోంది. 10 రోజులు తర్వాత ఉచిత పరీక్షలు, మందులు సైతం అందుకోవచ్చు.

ఆరోగ్యశ్రీ బతికించింది



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించుకున్నాను. ఈ పథకం వల్లే ఖరీదైన వైద్యం నాకు అందింది. లేకుంటే నా కోసం నా కుటుంబం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. నాలాంటి పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ఎంతో మేలు చేస్తోంది.

– పసుపులేటి సుబ్బులక్ష్మి, చాటపర్రు

పేదలకు వరం



ఆపరేషన్ చేయించుకున్న తర్వాతా ప్రభుత్వం నాకు రూ.5 వేలు జీవన భృతి ఇచ్చింది. చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్ అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నాలాంటి పేదలకు వరం. ఆరోగ్య వల్లే పేదలు ఆరోగ్యంగా జీవిస్తున్నారు. ఈ పథకం లేకపోతే ఆర్థిక కష్టాలు తప్పవు.

– కదలి మహేశ్వరి, చాటపర్రు

వైఎస్ చిరస్మరణీయుడు



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడు. ఆయన వల్ల ఎందరో పేదలు గుండె ఆపరేషన్లు చేయించుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ గ్రామాల్లోనే ఉచిత వైద్య శిబిరాలు, ఆసరాతో పేదలకు అండగా నిలిచారు.

– అనిల్‌కుమార్, సత్రంపాడు, వైఎస్సార్ సీపీ జిల్లా వాణిజ్య కమిటీ

క్లుప్తంగా

భగవద్గీత శ్లోక పఠన పోటీలో భువన శ్రీకి ప్రథమం


భువనశ్రీని అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు సురేష్, విజయలక్ష్మి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల భీమవరంలో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీల జూనియర్స్ విభాగంలో ఏలూరు జింగిల్ బెల్స్ పాఠశాల విద్యార్థిని గుబిలి భువనశ్రీ ప్రథమ బహుమతి సాధించినట్టు పాఠశాల డైరెక్టర్ వి.సురేష్, ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి తెలిపారు. రూ.5 వేలు, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందుకున్న భువనశ్రీని ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


మాస్టర్ ట్రైనర్ల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా సంయుక్త కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో జేసీ లావణ్యవేణి మాట్లాడారు. పోలింగ్ సమయంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల విధి నిర్వహణపై సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించామన్నారు. పోలింగ్ ఆఫీసర్ విధులు, పోలింగు ముందురోజు, అనంతరం నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మాస్టర్ ట్రైనీలు సబ్బితి నరసింహ మూర్తి, రాజశేఖర్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జితేంద్ర, భావన్నారాయణ, సూర్యప్రభ, ఎంపీడీఓలు తేజరతన్, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

18న ఆళ్ల నాని నామినేషన్‌కు తరలిరండి


మాట్లాడుతున్న లక్కోజు రాజగోపాలాచారి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ ఏలూరు అసెంబ్లీ అభ్యర్థిగా ఈ నెల 18న ఆళ్ల నాని నామినేషన్ వేసే కార్యక్రమానికి బీసీలంతా తరలిరావాలని ఆ పార్టీ బీసీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి కోరారు. మే 13న నిర్వహించే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆళ్ల నాని, ఎంపీగా కారుమూరి సునీల్ గెలుపునకు ప్రతి బీసీ కృషి చేయాలన్నారు. బీసీలకు రాజ్యాధికారం, అభివృద్ధి, సంక్షేమం, పదవులు ఏలూరులోని బీసీలకు కేటాయించిన ఘనత ఆళ్ల నానిదని తెలిపారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన నానికి మద్దతుగా ప్రతిఒక్కరూ కదిలి రావాలని కోరారు. వైఎస్సార్ సీపీ బీసీల పార్టీ అని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా నాని, ఎంపీగా సునీల్, సీఎంగా వైఎస్ జగన్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి బీసీపైనా ఉందని చెప్పారు. గురువారం ఉదయం 9 గంటలకు నాని తన క్యాంపు ఆఫీసు నుంచి శనివారపుపేట, 12 పంపుల సెంటర్, నూకాలమ్మ గుడి, పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం, మెయిన్ బజార్, గడియార స్తంభం ప్రాంతాల మీదుగా ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీలంతా పాల్గొనాలని రాజగోపాలాచారి పిలుపు నిచ్చారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు తమ కళాశాల నుంచి 83 మంది విద్యార్థులు హాజరు కాగా 78 శాతంతో 65 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. బీఏ గ్రూప్‌లో 83 శాతం, బీకాం గ్రూప్‌లో 86 శాతం, బీఎస్సీ గ్రూపులో 65 శాతం ఉత్తీర్ణులయ్యారని వివరించారు. పొలిటికల్ సైన్స్, బోటని, జువాలజీ, కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టుల్లో నూరుశాతం ఉత్తీర్ణులుకాగా ఇతర సబ్జెక్టుల్లో 80 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను గిరిబాబు ప్రత్యేకంగా అభినందించారు.

కళాకారులకు సన్మానం


లక్ష్మీస్ ఎన్‌టీఆర్ చిత్రం ప్రధాన పాత్రధారి విజయకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరానికి చెందిన స్నేహమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక పవర్‌పేటలోని స్నేహమ్ అసోసియేషన్ భవనంలో ప్రముఖ రంగస్థలం సినీ నటుడు పి.విజయకుమార్ (లక్ష్మీస్ ఎన్టీఆర్, యాత్ర సినిమాల ఫేమ్)ను స్నేహం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబికా రాజా, కళారత్న కేవీ సత్యనారాయణ, మజ్జి కాంతారావులు ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా రంగస్థల నటీనటులు టి.విశ్వేశ్వరరావు, కె.భాస్కరరావు, టి.రమ్యకృష్ణ, బేతా కోటేశ్వరరావు, ఎస్కే హమీద్, బొలిశెట్టి గంగరాజులను సత్కరించారు. కార్యక్రమంలో స్నేహమ్ అసోసియేషన్ సభ్యులు, అంబికా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానికే వ్యాపారుల మద్దతు


ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏలూరు న్యూమార్కెట్ వ్యాపారులు

ఏలూరు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తామని, ఎమ్మెల్యే ఆళ్ల నాని గెలుపుకు తమవంతు కృషి చేస్తామని ఏలూరు న్యూ మార్కెట్ వ్యాపారులు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగర అభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమానికి ఎంతో కృషి చేస్తోన్న ఆళ్ల నానిని మళ్లీ గెలిపించుకునేలా పనిచేస్తామని, తమ పూర్తి మద్దతు ప్రకటించారు. తమకు వ్యాపార స్థలాలను కేటాయించి ఆదుకున్నారంటూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏలూరు నగర కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా చైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, వ్యాపారులు గాడి రాంబాబు, ఇమంది సింహాచలం, అర్జున్, తుమ్మల రవి, ఎ.సత్యనారాయణ, ఎ.రమేష్, కిరణ్, గాడి బుజ్జి తదితరులు ఉన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు వేసి ఆలయాలకు రంగులు వేసి నిత్యనూతనంగా తీర్చిదిద్దారు. బుధవారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆయా ఆలయాల్లో కల్యాణ మహోత్సవం నిర్వహించి భక్తులకు పానకం వడపప్పు ప్రసాదాల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. అమీనాపేటలోని రిజర్వ్ పోలీస్‌లైన్‌లో శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో ఉదయం కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం శ్రీ సీతారాముల ఊరేగింపు నిర్వహిస్తారు. 40వ డివిజన్లో ఫ్రెండ్స్ యూనిటీ సెంటర్ వద్ద శ్రీరామ మందిరంలో శ్రీ భద్రాద్రి సీతారామ స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి దివ్య తిరుకల్యాణ మహోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. 18వ తేదీన వసంతోత్సవం, శ్రీపుష్పయాగం, రాత్రి ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో స్థానిక అమీనాపేట విద్యుత్ రామాలయంలో 19వ వార్షిక శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా ఈపీడీసీఎల్ ఏలూరు సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు పాల్గొంటారు. స్థానిక రామచంద్రరావు పేట సుబ్బమ్మ దేవి స్కూల్ రోడ్డులోని కోదండ రామాలయం, దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రం, నరసింహారావు పేట షిర్డీ సాయి మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.

మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమే


ప్రత్తికోళ్లలంకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


సమావేశానికి హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

ఏలూరు రూరల్ : ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కడతారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంకలో వైఎస్సార్ సీపీ ఏలూరు రూరల్ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మద్దతుతో కొరవులైన ప్రతిపక్షాలతో పోరాడుతున్నారని చెప్పారు. ఈ పోరాటంలో జగన్ విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. ఆయన అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ఐదేళ్లలో దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా మూడు వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ప్రజల్లో జగన్‌కు వస్తోన్న మద్దతు, ప్రజాధరణ చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు దాడులకు పునుకుంటున్నాయని ఆరోపించారు. రాబోయే ఐదేళ్లలో దెందులూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అబ్బయ్యచౌదరి హామీ ఇచ్చారు. ఈనెల 19 తేదీ తాను నామినేషన్ వేస్తున్నాని, ప్రజలంతా హాజరుకావాలని ఆయన కోరారు. కొల్లేరు గ్రామాల అభివృద్ధికి అబ్బయ్యచౌదరి ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కొనియాడారు. దెందులూరు ఎమ్మెల్యేగా మరోసారి అబ్బయ్యచౌదరిని గెలిపించేందుకు కొల్లేరు గ్రామాల ప్రజలు కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కొల్లేరు ప్రజలను విభజించి పాలించారని గుర్తుచేశారు. ప్రజల కష్టాలను పట్టించుకోలేదని విమర్శించారు. తొలుత గ్రామస్తులు అబ్బయ్యచౌదరికి ఘన స్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రత్తికోళ్లలంక ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించారు. పార్టీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ అధ్యక్షతన వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ పరివేక్షణలో నిర్వహించిన ఈ సమావేశంలో టీటీడీ బోర్డు మెంబర్ నెరుసు నాగసత్యం, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, నాయకులు మండల కొండలరావు, జయమంగళ రామారావు, పల్లెం ప్రసాద్, నరహరిశెట్టి రాధాకృష్ణ, బొల్లిముంత రాము, గుడిపూడి రఘు, ఘంటసాల మహలక్ష్మీరాజు, బలే సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు పండగ రోజు


గాయకుడు బగ్గం చంద్రమౌళిని సత్కరించిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు నాటకరంగ దినోత్సవం రంగస్థల కళాకారులకు పండుగ రోజు అని హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ అన్నారు. కలియుగవైతాళికు లు కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం నిర్వహించారు. నాట్యాచార్య గండికోట రాజేష్ సమర్పణలో జాహ్నవి లాలిత్య బృందం ప్రదర్శించిన కూచిపూడి స్వాగత నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా సభకు నంది అవార్డు గ్రహీ త ఎండీ ఖాజావలి స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా కళారత్న కేవీ సత్యనారాయణ, గౌరవ అతి థులుగా యర్రా సోమలింగేశ్వరరావు, లంకా వెంకటేశ్వర్లు, వేమా కోటేశ్వరరావు, నగరపాలక సంస్థ విప్ పైడి భీమేశ్వరరావు, పుల్లాభొట్ల పురుషోత్తం పాల్గొని రంగస్థలం, తెలుగు నాటక రంగం, ఏలూరు నాటక రంగ విశిష్టతను వివరించారు. స్థానిక గుప్తా ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్థిక సాయంతో తబలా కళాకారుడు సీహెచ్ కల్యాణ్, గాయకులు బగ్గం చంద్రమౌళి, పౌరాణికి నటులు సరిపల్లి సారి సత్యనారాయణ, పౌరాణిక నటీమణి సీబీ కల్యాణిలు ఆర్థిక సత్కారం అందుకున్నారు. రంగస్థల పౌరాణిక నటులు కడియాల విజయ భాస్కర్, జిల్లా కళాకారు ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి అప్పారావులు గౌర వ సత్కారం అందుకున్నారు. కలకుర్రు మారుతీ యువకళా నాట్యమండలి కళాకారుల ఆధ్వర్యంలో ప్రదర్శించిన సత్య హరిశ్చంద్ర (వారణాసి సన్నివేశం) ఆకట్టుకుంది. సంస్థ ప్రధాన కార్యదర్శి గండికోట రాజేష్, కోశాధికారి కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు, సంకు సురేష్, పి.విజయ్ కుమార్, గుప్తా ఫౌండేషన్ ప్రతినిధి పట్టాభి పాల్గొన్నారు.

టీడీపీ కోవర్టులకు జనసేన టికెట్లు

- అభ్యర్థుల్లో 16 మంది చంద్రబాబు పంపిన వారే
- జనసేన కైకలూరు మాజీ ఇన్‌చార్జి బీవీ రావు యాదవ్ విమర్శలు


ఏలూరులో విలేకరులతో మాట్లాడుతున్న బీవీ రావు యాదవ్ తదితరులు

ఏలూరు (టూటౌన్): జనసేన ఆవిర్భావం నుంచి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను పక్కనపెట్టి టీడీపీ కోవర్టులకు టికెట్లు కేటాయించిన ఘనత పవన్ కల్యాణ్‌కే దక్కుతుందని ఆ పార్టీ కైకలూరు మాజీ ఇన్‌చార్జి బీవీ రావుయాదవ్ ధ్వజమెత్తారు. పొత్తులో భాగంగా రాష్ట్రంలో 21 సీట్లు మాత్రమే దక్కించుకుని, వాటిలో 16 చోట్ల టీడీపీ వారిని నిలబెట్టడమే అందుకు నిదర్శనమని విమర్శించారు. నారాయణపురంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరిన ఆయన ఏలూరులో విలేకరులతో మాట్లాడారు. 2014లో జనసేన ఆవిర్భవించిన నాటి నుంచి కైకలూరులో తాను పనిచేశానని, 2019లో జనసేన తరఫున కై కలూరు నుంచి పోటీ చేశానని చెప్పారు. అప్పటి నుంచి పార్టీ జెండాను మోస్తూ పార్టీని బతికించానని, తీరా ఎన్నికల్లో టికెట్లు ఇచ్చే సమయానికి పొత్తుల పేరుతో అన్యాయం చేశారని మండిపడ్డారు. పవన్ బీసీలను తీవ్రంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీలంతా జగన్ వైపే ఉన్నారని బీవీ రావు స్పష్టం చేశారు. కైకలూరులో వైఎస్సార్‌సీపీ విజయానికి తాను, తన అనుచరులు అవిశ్రాంతంగా పనిచేస్తామని తెలిపారు. కై కలూరు నియోజకవర్గ యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు పచ్చిగోళ్ల రామకృష్ణ, జనసేన కృష్ణా జిల్లా కార్యదర్శి పల్లెం ఉమ తదితరులు పాల్గొన్నారు.